క్లుప్తంగా

కేజీబీవీ విద్యార్థుల ప్రతిభ



విద్యార్థినులతో ప్రిన్సిపల్ ఫణిశ్రీ, పీఈటీ ఉపాధ్యాయురాలు ప్రమీళ

అట్లూరు : రాష్ట్రస్థాయి అండర్–17 సాఫ్ట్‌బాల్ ఆటల పోటీలలో అట్లూరు కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాల విద్యార్థినులు ప్రతిభ కనబరిచారని ఆపాఠశాల ప్రిన్సిపల్ ఫణిశ్రీ, పీఈటీ ప్రమీళ పేర్కొన్నారు. ఈనెల 4వ తేదీ నుంచి 6వ తేదీ వరకూ ఒంగోలులో అండర్ – 17 విభాగంలో జరిగిన రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ ఆటల పోటీలలో మన జిల్లా జట్టు రెండవ స్థానం కైవసం చేసుకుందన్నారు. జట్టులోని పి.హారిక, బి.సుహాషిణి పాల్గొని ప్రతిభ కనబరిచారన్నారు. కాగా మంగళవారం పాఠశాల ఉపాధ్యాయ బృందంతో కలసి వారిని అభినందించారు.

వసతి గృహాల సమస్యలను పరిష్కరించాలి

ప్రొద్దుటూరు : ఎస్సీ, ఎస్టీ, బీసీ సంక్షేమ వసతి గృహాల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని ఆర్ఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ప్రశాంత్ తెలిపారు. విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మంగళవారం స్థానిక ఎస్‌పీసీఎస్ మున్సిపల్ హైస్కూల్ విద్యార్థులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హాస్టల్‌లో రెగ్యులర్ వార్డెన్లు లేక ఇన్‌చార్జిలతో ప్రభుత్వం నెట్టుకొస్తోందని తెలిపారు. హాస్టల్ విద్యార్థులకు సకాలంలో మెస్ కాస్మోటిక్ చార్జీలు విడుదల చేయకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. కార్యక్రమంలో ఆర్ఎస్‌యూ నాయకులు పాల్గొన్నారు.

14 నుంచి గ్రంథాలయ వారోత్సవాలు

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక రామేశ్వరం బాలబాలికల గ్రంథాలయంలో ఈ నెల 14 నుంచి 20 వరకు జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను నిర్వహించనున్నట్లు రికార్డు అసిస్టెంట్ ఇబ్రాంసాహెబ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాలల విద్యార్థులకు క్విజ్, చిత్రలేఖన, వ్యాసరచన పోటీలను నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులు అందచేయనున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి గల విద్యార్థులు తమ పేర్లను గ్రంథాలయంలో నమోదు చేసుకోవాలని కోరారు.

ఘనంగా ఆరాధనోత్సవం



ప్రత్యేక అలంకరణలో క్రిష్ణయ్యస్వామి సమాధి

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక వైఎంఆర్ కాలనీలోని అవధూత దిగంబర క్రిష్ణయ్యస్వామి మందిరంలో మంగళవారం స్వామివారి 5వ ఆరాధన ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఉదయం స్వామివారి దివ్యసమాధికి విశేష అభిషేకాలు చేసి పూలతో విశేషంగా అలంకరించారు. భక్తులు ఈ వేడుకలో పాల్గొని స్వామివారిని భక్తిశ్రద్ధలతో పూజించి తీర్థప్రసాదాలు స్వీకరించారు. రాత్రి భక్తులు భజన కార్యక్రమం నిర్వహించారు.

'జగనన్నకు చెబుదాం' వాయిదా

కాశినాయన : మండల కేంద్రమైన నరసాపురంలో బుధవారం జిల్లా కలెక్టర్ విజయరామరాజు ఆధ్వర్యంలో నిర్వహించనున్న జగనన్నకు చెబుదాం కార్యక్రమం వాయిదా పడినట్లు ఎంపీడీఓ మైథిలి తెలిపారు. కావున మండల ప్రజలు నరసాపురం తహసీల్దారు కార్యాలయానికి కార్యక్రమం నిమిత్తం రావద్దని తెలిపారు. ఈ విషయాన్ని ప్రజలు గమనించాలని ఆమె కోరారు.

5923 మందికి రైతు భరోసా

కాశినాయన : మండలంలోని 5923 మంది రైతులకు దాదాపు రూ.1.18 కోట్లు రైతు భరోసా కింద వారి ఖాతాల్లో జమ చేసినట్లు మండల వ్యవసాయాధికారి ప్రవీణ్‌కుమార్ తెలిపారు. ఈ–క్రాప్ చేయించుకున్న ప్రతి రైతుకు రైతు భరోసా పడుతుందన్నారు. ఈ–క్రాప్ చేయించుకోకపోతే పంట నష్టపోయినా కూడా పరిహారం అందదన్నారు. కావున ప్రతి రైతు ఈ–క్రాప్ నమోదు చేయించుకోవాలని ఆయన తెలిపారు.

కోర్టు భవనంలో లిఫ్ట్ ఏర్పాటు చేయాలి

ప్రొద్దుటూరు : స్థానిక కోర్టు భవనంలో లిఫ్ట్ ఏర్పాటు చేయాలని ఆర్అండ్‌బీ అధికారికి మంగళవారం ప్రజాపక్షం అధ్యక్షుడు పుత్తా లక్ష్మీరెడ్డి వినతి పత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలోని కోర్టు భవనంలో పై అంతస్తుకు వెళ్లేందుకు లిఫ్ట్ లేకపోవడంతో ప్రమాదాలకు గురైన కక్షిదారులను వారి బంధువులు చేతులపై ఎత్తుకెళ్లాల్సి వస్తోందన్నారు. రెండో అదనపు మెజిస్ట్రేట్ కోర్టు హాలు పునరుద్ధరణ పనులను పూర్తి చేయాలని, మెయిన్ కోర్టు బిల్డింగ్ రెండో అంతస్తులో ఉన్న ఒకటవ అదనపు మెజిస్ట్రేట్‌కోర్టు హాల్ బయట ఫ్లోరింగ్ వేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రజాపక్షం నాయకులు పాల్గొన్నారు.

ఆదాయంలో మైదుకూరు డిపో జిల్లాలో ఫస్ట్

డిపో, గ్యారేజి ఉద్యోగులను అభినందించిన డీఎం శ్రీనివాసరావు



వివరాలను తెలుపుతున్న డీఎం శ్రీనివాసరావు

మైదుకూరు : ఆదాయంలో మైదుకూరు ఆర్టీసీ డిపో జిల్లాలో మొదటి స్థానం సంపాదించినట్లు డిపో మేనేజర్ కె.శ్రీనివాసరావు తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ దసరా ప్రత్యేక బస్సు సర్వీసుల వల్ల కూడా డిపోకు అదనపు ఆదాయం సమకూరినట్లు పేర్కొన్నారు. మైదుకూరు డిపోలో 28 సొంత బస్సులు, 25 అద్దె బస్సులు ఉన్నాయని 52 సర్వీసులు నిర్వహిస్తున్నామని తెలిపారు. డిపోలో 53 షెడ్యూళ్లకు 21 వేల కిలోమీటర్లు బస్సులు నడుస్తున్నాయని చెప్పారు. రోజుకు రూ.8.16 లక్షలతో రూ.2.53 కోట్ల ఆదాయాన్ని సంపాదించడం లక్ష్యమని పేర్కొన్నారు. కాగా అక్టోబర్ నెలకు జిల్లాలో 74 శాతం ఆక్యుపెన్సీతో రూ.2.47 కోట్లు ఆదాయంతో మైదుకూరు డిపో జిల్లాలో ప్రథమ స్థానంలో నిలిచిందని డీఎం వివరించారు. ద్వితీయ, తృతీయ స్థానాల్లో 73 శాతం ఆక్యుపెన్సీతో బద్వేలు డిపో, 72 శాతం ఆక్యుపెన్సీతో ప్రొద్దుటూరు డిపో నిలిచాయని తెలిపారు. మైదుకూరు డిపోలో గత ఏడాది ఆదాయం కంటే ఈసారి 0.15 శాతం పెరిగిందని పేర్కొన్నారు. ఆక్యుపెన్సీ గత ఏడాది 69 శాతం ఉండగా, ఈ ఏడాది 74 శాతంతో 5 శాతం పెరిగిందన్నారు. కిలోమీటర్‌కు రూ.38.71 సంపాదించడం లక్ష్యం కాగా రూ.38.01 వచ్చిందన్నారు. వాహన వినియోగం 376 కిలోమీటర్లు లక్ష్యం కాగా, 374 కిలోమీటర్లు తిరిగినట్లు తెలిపారు. తర్వాత హైదరాబాద్, బెంగళూరు, విజయవాడ తదితర ప్రాంతాలకు 32 ప్రత్యేక బస్సు సర్వీసులను నడిపామన్నారు. ఇందువల్ల డిపోకు రూ.9.11 లక్షలు అదనపు ఆదాయం వచ్చిందన్నారు. ఆదాయంలో మైదుకూరు డిపో జిల్లాలో మొదటి స్థానంలో నిలిచేందుకు డిపో ఉద్యోగులు, గ్యారేజి ఉద్యోగులు ఎంతో కృషి చేశారని వారిని డీఎం అభినందించారు. ఈ సమావేశంలో ఎస్‌టీఐ మంజుల, గ్యారేజి ఇన్‌చార్జి ఎల్‌హెచ్ సుబ్బయ్య పాల్గొన్నారు.

ఆర్టీసీ అభివృద్ధికి సమష్టిగా కృషి చేయాలి



డిపో పరిసరాలను పరిశీలిస్తున్న ప్రజా రవాణా అధికారి గోపాల్‌రెడ్డి

బద్వేలు అర్బన్ : ఆర్టీసీ ఉద్యోగులు సంస్థ అభివృద్ధికి సమష్టిగా కృషి చేయాలని జిల్లా ప్రజా రవాణా అధికారి పి.గోపాల్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం ఆర్టీసీ గ్యారేజీలో నిర్వహించిన డిపో పరిధిలో వివిధ అంశాలలో మంచి ఫలితాలు సాధించిన ఆదర్శ ఉద్యోగుల అభినందన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ప్రతి ఉద్యోగి పోటీతత్వంతో పనిచేసి సత్ఫలితాలు సాధించాలని కోరారు. డీజిల్ ఆదా, సంస్థ ఆదాయం, కార్గో సేవలలో ఉత్తమ ఫలితాలు సాధించిన ఉద్యోగులను, డ్రైవర్లు, కండక్టర్లు, మెకానిక్‌లను సన్మానించి ప్రశంసా పత్రాలు అందజేశారు. తొలుత బస్టాండు ఆవరణలోని మరుగుదొడ్లను పరిశీలించి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని కాంట్రాక్టర్లను ఆదేశించారు. అలాగే కార్గో సేవలు ప్రజలకు మరింత చేరువయ్యేలా చూడాలని సూచించారు. కార్యక్రమంలో డిపో మేనేజర్ జె.శ్రీనివాసరావు, ఎస్‌టీఐ బి.ఎస్.నాయక్, ఉద్యోగులు పాల్గొన్నారు.

నవజాత శిశు సంరక్షణపై అవగాహన అవసరం



ఆశా కార్యకర్తలకు హెచ్‌బీఎన్‌సీ కిట్లను పంపిణీ చేస్తున్న వైద్యాధికారులు

చాపాడు : బిడ్డ పుట్టినప్పటి నుంచి నవజాత శిశువు సంరక్షణ విషయంలో గర్భిణులకు అవగాహన కల్పించాలని జిల్లా వైద్య శాఖ ప్రోగ్రామ్ ఆఫీసర్ శశిభూషణ్‌రెడ్డి పేర్కొన్నారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం ఆశా డే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డీపీఎంఓ మాట్లాడుతూ.. గ్రామాల్లోని గర్భిణుల ఇళ్ల వద్దకు ఆశా కార్యకర్తలు తరచూ వెళ్లి సలహాలు, సూచనలు ఇవ్వాలన్నారు. గర్భిణులు తప్పనిసరిగా పోషకాహారం తీసుకునేలా అవగాహన కల్పించాలన్నారు. జిల్లా ఇమ్యునైజేషన్ ఆఫీసర్ ఉమామహేశ్వర్ మాట్లాడుతూ.. బిడ్డ పుట్టినప్పటి నుంచి జీరో డోస్ మొదలుకుని అన్ని రకాల వ్యాక్సిన్‌లు క్రమం తప్పకుండా వేయించాలన్నారు. అనంతరం ఆశా కార్యకర్తలకు నవజాత శిశువుల సంరక్షణ గురిచి తెలియజేస్తూ హెచ్‌బీఎన్‌సీ కిట్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు రాజేష్‌కుమార్, శ్రీవాణి, ఓబులేసు, కావ్యమాధురి, ఆశా నోడల్ ఆఫీసర్ సుకన్య, సీహెచ్‌ఓ మహాదేవ యాదవ్, సూపర్‌వైజర్ సరస్వతి, అంగన్వాడీ సూపర్‌వైజర్ సుబ్బరత్నమ్మ, ఎఫ్‌పీసీ పర్యవేక్షకుడు నారాయణరెడ్డి, ఏఎన్ఎం, ఎంఎల్‌హెచ్‌పీ, అంగన్వాడీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

నేడు అల్లాడుపల్లెలో ఫ్యామిలీ డాక్టర్ వైద్య శిబిరం

చాపాడు : మండలంలోని అల్లాడుపల్లె గ్రామంలో బుధవారం ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్ కార్యక్రమంలో భాగంగా ఫ్యామిలీ డాక్టర్ వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు వైద్యాధికారి రాజేష్ కుమార్ తెలిపారు. అల్లాడుపల్లె గ్రామ సచివాలయం వద్ద ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకూ వైద్య శిబిరంలో వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులు పంపిణీ చేయనున్నట్లు ఆయన తెలిపారు.

రేపటి నుంచి 'పల్లెకు పోదాం'

మైదుకూరు : మైదుకూరు మండలంలో ఈనెల 9వ తేదీ గురువారం నుంచి 'సంక్షేమ పథకాల బోర్డుల ఆవిష్కరణ', 'పల్లెకు పోదాం' కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ ఏవీ రమణారెడ్డి తెలిపారు. ఈనెల 9వ తేదీ నుంచి 23వ తేదీ వరకు ఈ కార్యక్రమాలు జరుగుతాయని పేర్కొన్నారు. ఈనెల 9న అన్నలూరు, 10న ఆదిరెడ్డిపల్లె, 14న మిట్టమానుపల్లె, 15న ఎర్రబల్లె, 16న నంద్యాలంపేట–1, 17న నంద్యాలంపేట–2 సచివాయాల పరిధిలో కార్యక్రమాలు నిర్వహిస్తామని వివరించారు. ఈనెల 20న వనిపెంట, 21న శివపురం, 22న తువ్వపల్లె, 23న విశ్వనాథపురం సచివాలయాల పరిధిలో ఈ కార్యక్రమం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమాలు ఆయా రోజుల్లో మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరుగుతాయని ఎంపీడీఓ తెలిపారు.

సోలార్ ప్లాంటుకు భూములు ఇచ్చేందుకు సిద్ధం

బ్రహ్మంగారిమఠం : సోలార్ ప్లాంటుకు డీ పట్టాలు, అనుభవంలో ఉన్న రైతుల పొలాలు ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నారని ఎంపీపీ సి.వీరనారాయణరెడ్డి తెలిపారు. మంగళవారం పలుగురాళ్లపల్లె గ్రామ సచివాలయంలో ఏర్పాటు చేసిన రైతుల సమీక్షలో ఎంపీపీ మాట్లాడుతూ మండలంలో పరిశ్రమలు రావాలని కోరుకుంటున్నామని, ఇందుకు ఎమ్మెల్యే ఎస్.రఘురామిరెడ్డి కూడా సానుకూలంగా ఉన్నారని చెప్పారు. ఎకరాకు రూ.10లక్షలు ఇవ్వాలని రైతులు కోరుతున్నట్లు ఎంపీపీ తెలిపారు. ఈ సందర్భంగా డిప్యూటీ తహసీల్దార్ జాన్స్ మాట్లాడుతూ రైతుల అభిప్రాయాలను ఆర్డీఓ , జేసీ, కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి నష్టపోతున్న ప్రతి రైతుకు న్యాయం జరిగేలా చూస్తామన్నారు. ఈ కార్యక్రమంలో రీసర్వే అధికారి, సోలార్ ప్రతినిధి, మండల సర్వేయర్ వెంకటలక్ష్మి, ఎంపీటీసీ, సర్పంచ్‌ల భర్తలు, గ్రామ సచివాలయం సిబ్బంది రైతులు పాల్గొన్నారు.

అల్లాడుపల్లెలో 18న వేలంపాట

చాపాడు : మండలంలోని అల్లాడుపల్లె శ్రీ వీరభద్ర స్వామి దేవస్థాన సన్నిధిలో ఈ నెల 18న తలనీలాల సేకరణ, టెంకాయల విక్రయానికి వేలం పాట నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈఓ శ్రీనివాసులు తెలిపారు. దేవస్థానం వద్ద 2024 జనవరి 1 నుంచి 2025 జనవరి 1వ తేదీ వరకూ తలనీలాల సేకరణ, అలాగే ఈ ఏడాది డిసెంబర్ 7 నుంచి 2024 డిసెంబర్ 6 వరకూ టెంకాయలు అమ్ముకునే హక్కు కోసం వేలం పాట నిర్వహిస్తున్నామన్నారు. ఆలయ నిబంధనల మేరకు హెచ్చు వేలం పాటదారుడికి హక్కులను అప్పగిస్తామని తెలిపారు.

హైస్కూల్ విద్యార్థులకు దుస్తులు పంపిణీ



ఫౌండేషన్ ఫర్ చిల్డ్రన్ ఇన్ నీడ్ సంస్థ అందజేసిన దుస్తులతో విద్యార్థులు

బ్రహ్మంగారిమఠం : బ్రహ్మంగారిమఠంలోని కందిమల్లాయపల్లె వద్ద గల జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో 413 మంది విద్యార్థులకు మంగళవారం పోరుమామిళ్లకు చెందిన ఫౌండేషన్ ఫర్ చిల్డ్రన్ ఇన్ నీడ్ సంస్థ వ్యవస్థాపకులు చిత్తా తోమస్ రెడ్డి, డాక్టర్ గీతా ఆధ్వర్యంలో దుస్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ ఫర్ చిల్డ్రన్ ఇన్ నీడ్ సంస్థ ప్రతినిధులు శ్రీకాంత్‌రెడ్డి, ప్రసాద్ మాట్లాడుతూ.. క్రిస్మస్, నూతన సంవత్సర వేడుకలను పురస్కరించుకుని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే విద్యార్థులకు దుస్తులను పంపిణీ చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

యూటీఎఫ్ మండల కమిటీ ఎన్నిక

ప్రొద్దుటూరు : స్థానిక హోమస్ పేటలోని మున్సిపల్ ప్రాథమిక పాఠశాలలో యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి డీవీ రవీంద్రుడు అధ్యక్షతన మంగళవారం యూటీఎఫ్ మండల కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల నూతన కమిటీని ఎన్నుకున్నట్లు ఆయన తెలిపారు. యూటీఎఫ్ మండల గౌరవాధ్యక్షుడుగా ఎం.సుందరం, అధ్యక్షుడుగా కె.గంగాధర్, సహాధ్యక్షులుగా ఎం.నాగరాజు, ఎస్.జమృద్, ప్రధాన కార్యదర్శిగా ఎం.గంగన్న, కోశాధికారిగా జి.వీరారెడ్డి, మండల కౌన్సిలర్లుగా టి.అరుణ, పి.శ్రీనివాసులు, కె.మోహన్ కుమార్, కె.శ్రీనివాసులు, జిల్లా కౌన్సిలర్లుగా కె.కొండయ్య, వి.లక్ష్మీదేవి, ఆడిట్ కమిటీ కన్వీనర్లుగా బి.వి జయకుమారి, ఎం.లక్ష్మీనారాయణమ్మలను ఎన్నుకున్నట్లు ఆయన వివరించారు.

సీపీఎం ప్రజారక్షణ భేరిని జయప్రదం చేయండి

మైదుకూరు : దేశంలో, రాష్ట్రంలో బీజేపీ, వైఎస్సార్ సీపీ ప్రభుత్వాలు అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను వివరిస్తూ, అసమానతలు లేని అభివృద్ధి కావాలని కోరుతూ సీపీఎం ఆధ్వర్యంలో ఈనెల 15న విజయవాడలో జరిగే ప్రజా రక్షణభేరి మహాసభను జయప్రదం చేయాలని సీపీఎం నాయకులు కోరారు. మంగళవారం మైదుకూరులోని సుందరయ్య నగర్‌లో సీపీఎం మండల కమిటీ ఆధ్వర్యంలో ప్రజారక్షణ భేరి పోస్టర్లు, స్టిక్కర్లు, కరపత్రాలు విడుదల చేశారు. అనంతరం సీపీఎం నాయకులు మాట్లాడుతూ బీజేపీ బుల్డోజర్ రాజకీయాలతో సమైక్యంగా మెలగాల్సిన ప్రజల మధ్య విద్వేషాలు రాజేస్తోందని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు శివకుమార్, మండల కార్యదర్శి ఎస్ఎం షరీఫ్, మండల కమిటీ సభ్యులు గురవయ్య, ఓబయ్య పాల్గొన్నారు.

తైక్వాండో పోటీలకు పోరుమామిళ్ల విద్యార్థులు



రాష్ట్రస్థాయికి ఎంపికైన విద్యార్థులు

పోరుమామిళ్ల : కడప ఇండోర్ స్టేడియంలో సోమవారం జరిగిన తైక్వాండో స్కూల్ గేమ్స్‌లో పోరుమామిళ్ల విద్యార్థులు ప్రతిభ చాటారు. కడప, అన్నమయ్య జిల్లాలకు చెందిన 300 మంది విద్యార్థులు అండర్–14, అండర్–17 విభాగాల్లో పాల్గొనగా పోరుమామిళ్ల చెందిన ఏడుగురు ప్రథమ స్థానంలో నిలచి రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు మాస్టర్ నాయబ్‌రసూల్ తెలిపారు. అండర్–14లో సాహిత్య, విదుషన్, జమీల్, గోవర్ధన్, అబూబకర్, అండర్ –17లో మహిర్, చరణ్ విజేతలుగా నిలచారన్నారు. కోచ్‌లు నరసయ్య, సుభాష్‌లు పాల్గొన్నారన్నారు.

బీఈడీ పరీక్షల తనిఖీ

వైవీయూ : యోగివేమన విశ్వవిద్యాలయం పరిధిలో నిర్వహిస్తున్న బీఈడీ 2వ సెమిస్టర్ పరీక్షలను విశ్వవిద్యాలయ పరీక్షల నియంత్రణాధికారి ఆచార్య ఎస్. ఈశ్వరరెడ్డి, హైపవర్ కమిటీ సభ్యులు ఆచార్య వై. సుబ్బరాయుడు, డా. వి.వెంకట్రామ్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. కడప నగరంలోని ఐదు పరీక్షా కేంద్రాల్లో పరీక్షల నిర్వహణను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆచార్య ఎస్. ఈశ్వరరెడ్డి మాట్లాడుతూ ఈనెల 6న ప్రారంభమైన బీఎడ్ పరీక్షలు జిల్లా వ్యాప్తంగా 13 కేంద్రాల్లో ప్రారంభమయ్యాయన్నారు.

జాతీయ స్థాయి పోటీలకు విద్యార్థిని ఎంపిక



మాధవిని అభినందిస్తున్న ఉపాధ్యాయులు

బి.కోడూరు : మండలంలోని ఆదిత్యారాంపేట జెడ్పీహెచ్ఎస్‌లో 9వ తరగతి చదువుతున్న బత్తుల మాధవి జాతీయ స్థాయి బాల్ బాడ్మింటన్ పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జి.పెంచలయ్య తెలిపారు. ఆత్మకూరులో జరిగిన అండర్ – 14 బాలికల రాష్ట్రస్థాయి బాల్‌బాడ్మింటన్ పోటీల్లో మాధవి ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థిని మాధవిని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, వ్యాయామ ఉపాధ్యాయుడు పి.వి. సుబ్బారావు, ఉపాధ్యాయులు అభినందించారు.

10న తోలుబొమ్మలాట

కడప కల్చరల్ : కడప నగరం సీపీ బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రంలో ఈ నెల 10వ తేదీన తోలు బొమ్మలాట ప్రదర్శన నిర్వహించనున్నామని ఆ కేంద్రం సంచాలకులు ఆచార్య తప్పెట రామప్రసాద్‌రెడ్డి తెలిపారు. తెలుగు భాషోద్ధారకుడు సీపీ బ్రౌన్ 225వ జయంతి సందర్భంగా సాయంత్రం 6.00 గంటలకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నారన్నారు. ఇందులో భాగంగా తోలుబొమ్మలాట కళాకారులు సుందరకాండను ప్రదర్శిస్తారన్నారు. తోలుబొమ్మలాట ప్రదర్శనలో దేశ విదేశాల్లో ఖ్యాతి గడించి అవార్డులు, రివార్డులు పొందిన సత్యసాయి జిల్లా నిమ్మలకుంటకు చెందిన కళాకారులు ఈ ప్రదర్శన ఇస్తారని తెలిపారు.

అధిక ఫీజు వసూళ్లు ఆపాలి

కడప ఎడ్యుకేషన్: జిల్లావ్యాప్తంగా కార్పొరేట్, ప్రైవేటు పాఠశాలల్లో పదవ తరగతి పరీక్షల ఫీజుపేరుతో అధికంగా వసూలు చేస్తున్నారని విచారణ చేసి చర్యలు తీసుకోవాలని రాయలసీమ విద్యార్థి యువజన సంఘం జిల్లా కార్యదర్శి నాగేంద్రబాబు డిమాండ్ చేశారు. ఈ విషయమై మంగళవారం డీఈఓ కార్యాలయ అసిస్టెంట్ డైరెక్టర్ మునీర్‌ఖాన్‌ను కలిసి వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదవ తరగతి పరీక్ష ఫీజును ప్రభుత్వం రూ. 125 వసూలు చేయాలని ఉత్తర్వులు ఇచ్చిందన్నారు. కానీ జిల్లాలోని కడప, పొద్దుటూరు, జమ్మలమడుగు, బద్వేల్, పులివెందుల ప్రాంతాలలోని కార్పొరేట్, ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు తల్లిదండ్రుల వద్ద నుంచి రూ. 5 వందల నుంచి వెయ్యి వరకు ఫీజు వసూలు చేస్తున్నారన్నారు.

విద్యను ప్రోత్సహించడం అభినందనీయం



విద్యార్థినులకు స్టడీ మెటీరియల్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సుధ

గోపవరం : విద్యను ప్రోత్సహించడం అభినందనీయమని ఎమ్మెల్యే డాక్టర్ సుధ అన్నారు. మాజీ జెడ్పీటీసీ దివంగత రాచపూడి నాగభూషణం జయంతి సందర్భంగా మంగళవారం మండలంలోని గోపవరం జెడ్పీహెచ్ఎస్‌లో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్న విద్యార్థినులకు రూ.25 వేలు విలువ చేసే స్టడీ మెటీరియల్‌ను నాగభూషణం కుమారులు బద్వేలు మున్సిపల్ వైస్ చైర్మన్ సాయిక్రిష్ణ, వెటర్నరీ ప్రొఫెసర్ దిలీప్ గుప్తాల సహకారంతో ఎమ్మెల్యే డాక్టర్ సుధ చేతులమీదుగా అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చదువు పట్ల ఆసక్తి కలిగిన విద్యార్థులను ముందుండి నడిపిస్తూ ఇలాంటి సేవా కార్యక్రమాలు చేస్తూ ప్రోత్సహిస్తున్న మున్సిపల్ వైస్‌చైర్మన్ సాయిక్రిష్ణను ఎమ్మెల్యే అభినందించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో విద్యకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నారన్నారు. అందులో భాగంగానే గోపవరంలో గతేడాది బాలికల ఇంటర్మీడియట్ కళాశాలను మంజూరు చేయించామన్నారు. కార్యక్రమంలో బద్వేలు మున్సిపల్ చైర్మన్ రాజగోపాల్‌రెడ్డి, కుడా చైర్మన్ గురుమోహన్, ఏపీఐఐసీ డైరెక్టర్ ప్రభాకర్‌రెడ్డి, బద్వేలు మున్సిపాలిటీ కన్వీనర్ సుందర్‌రామిరెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి యద్దారెడ్డి, బద్వేలు మార్కెట్ యార్డు చైర్మన్ పుత్తా లక్ష్మీదేవి, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు మల్లికార్జునరెడ్డి, ఎంపీటీసీ సరస్వతమ్మ, సర్పంచ్ వెంకటలక్షుమ్మ తదితరులు పాల్గొన్నారు.

గ్రామ పర్యటనలను విజయవంతం చేద్దాం



మాట్లాడుతున్న మురళీమోహన్‌రెడ్డి

ఖాజీపేట : జగనన్న మళ్లీ సీఎంగా ఎందుకు కావాలంటే అనే అంశంపై ఈనెల 9 నుంచి గ్రామాల్లో జరిగే సమావేశాలను విజయవంతం చేద్దాం అని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ మురళీమోహన్‌రెడ్డి కోరారు. ఎంపీడీఓ కార్యాలయంలో నాయకులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 9వ తేదీ నాగసానిపల్లె, 10న మిడుతూరు, 14న కూనవారిపల్లె, 15న ఖాజీపేట –2, 16న ఖాజీపేట –1, 17న చెన్నముక్కపల్లె, 20న చెమ్ముళ్లపల్లె, 21న కొత్తపేట, 22న అప్పనపల్లె, 23న బి.కొత్తపల్లె గ్రామాల్లో పర్యటన ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీఐఐసీ డైరెక్టర్ గంగాధర్‌రెడ్డి, అగ్రహారం సొసైటీ డైరెక్టర్ రాఘవరెడ్డి, కోఆప్షన్ సభ్యుడు మున్వర్, సర్పంచ్‌లు సుబ్బారెడ్డి, బుజ్జి, పెద్దిరెడ్డి, ఎంపీటీసీలు కనపర్తి సుబ్బారెడ్డి, మండల ఉపాధ్యక్షుడు భాస్కర్‌రెడ్డి, సచివాలయాల కన్వీనర్ గోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బ్రహ్మంగారిమఠంలో

బ్రహ్మంగారిమఠం : ఈనెల 9నుంచి ప్రతి గ్రామ సచివాలయం పరిధిలోని గ్రామాల్లో ఏపీకి జగనే ఎందుకు సీఎం కావాలి అనే కార్యక్రమం ఉంటుందని ఎంపీపీ సి.వీరనారాయణరెడ్డి తెలిపారు. మంగళవారం ఎంపీడీఓ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ మేకల రత్నకుమార్ యాదవ్, సింగిల్‌విండో అధ్యక్షుడు నేలటూరు సుబ్బారెడ్డి, పాలరామిరెడ్డి, దుగ్గిరెడ్డి, రామగురివిరెడ్డి, రాజానాయుడు, జోగయ్య, లక్ష్మీదేవి తదితరులు పాల్గొన్నారు.

వివాదాస్పదంగా మారిన స్థల పరిశీలన



చియ్యపాడు లక్ష్మీచెన్నకేశ దేవస్థానం వద్ద కేసీ కాలువపై నిర్మాణం పరిశీలిస్తున్న రెవెన్యూ సిబ్బంది

చాపాడు : మండల పరిధిలోని చియ్యపాడు గ్రామంలోని శ్రీ లక్ష్మీ చెన్నకేశవ స్వామి దేవస్థాన ఆవరణలో కేసీ కాలువపై గతంలో పాల సేకరణ కేంద్రానికి రాతిగోడలు ఏర్పాటు చేయగా వివాదాస్పదంగా మారిన స్థలాన్ని మంగళవారం రెవెన్యూ అధికారులు పరిశీలించారు. ఈ నెల 3న చాపాడులో నిర్వహించిన జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో ఆలయ చైర్మన్ నిరంజన్‌రెడ్డితో పాటు పలువురు స్థానికులు దేవస్థాన స్థలం ఆక్రమణకు గురైందని ఫిర్యాదు చేశారు. దీనికి స్పందించిన తహసీల్దార్ యామిని రెవెన్యూ, కేసీ కెనాల్ సిబ్బందిని మంగళవారం పరిశీలనకు పంపారు. కొలతలు వేయగా దేవస్థానం స్థలం ఉందని గుర్తించారు. ఇదే క్రమంలో గ్రామానికి చెందిన ఎస్ఆర్ శివారెడ్డి ఈ కట్టడం తనకు సంబంధించిన స్థలంలో ఉందని, దీనికి సంబంధించిన రికార్డులు తన వద్దే ఉన్నాయని అధికారులకు చూపించాడు. మండల రెవెన్యూ కార్యాలయంలో రికార్డులను పరిశీలించి, శివారెడ్డి చూపుతున్న పత్రాలను సరిచూసి తదుపరి చర్యలు తీసుకుంటామని రెవెన్యూ సిబ్బంది తెలిపారు.

తిరుపతికి ఏసీ బస్సులు నడపండి



డిపోమేనేజర్ మల్లికార్జునరెడ్డి

ప్రొద్దుటూరు క్రైం : ప్రొద్దుటూరు నుంచి తిరుపతికి ప్రతి రోజు రెండు ఏసీ ఎలక్ట్రికల్ బస్సులను నడపాలని పలువురు ప్రయాణికులు ఆర్టీసీ డీఎంను కోరారు. ఇప్పటికే ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపించామని, సాధ్యమైనంత తొందరగా ప్రొద్దుటూరు నుంచి తిరుపతికి ఎలక్ట్రికల్ ఏసీ బస్సులను నడుపుతామని డిపోమేనేజర్ ఎ మల్లికార్జునరెడ్డి తెలిపారు. ప్రొద్దుటూరు ఆర్టీసీ డిపో మేనేజర్ మంగళవారం డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఫోన్ ద్వారా ప్రయాణికులు అడిగిన ప్రశ్నలకు డిపో మేనేజర్ మల్లికార్జునరెడ్డి జవాబు ఇచ్చారు. ఆర్టీసీ బస్సుల రాకపోకలకు సంబంధించి ఏవైనా సమస్యలుంటే 9959225777 అనే నంబర్‌కు ఫోన్ చేయాలన్నారు. అలాగే బస్సుల టైమింగ్స్ తెలుసుకునేందుకు ఎంక్వైరీ విభాగంలోని 08564244777, 9440340682 అనే నంబర్లకు ఫోన్ చేయాలని డిపో మేనేజర్ కోరారు.

ఘనంగా సి.వి.రామన్ జయంతి



సి.వి.రామన్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు

కాశినాయన : మండలంలోని పిట్టిగుంట ఎంపీపీ పాఠశాలలో మంగళవారం రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత జి.రమణారెడ్డి ఆధ్వర్యంలో డాక్టర్ సర్ సి.వి.రామన్ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఉపాధ్యాయులు, విద్యార్థులు నివాళులర్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు నారాయణ, అరుణ, నారాయణరెడ్డి, రాజు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక ఉపాధ్యాయ సేవా కేంద్రంలో మంగళవారం భారత రత్న భౌతిక శాస్త్రవేత్త సీవీ రామన్ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సీవీ రామన్ చిత్రపటానికి ఉపాధ్యాయ సంఘాల సమన్వయ వేదిక రాష్ట్ర గౌరవాధ్యక్షుడు ఒంటేరు శ్రీనివాసులు, సీవీ రామన్ సైన్స్ క్లబ్ జిల్లా కన్వీనర్ విజయమోహన్‌రెడ్డి పూలమాల వేసి ఘనంగా నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో రచయిత జింకా సుబ్రహ్మణ్యం, సూరారెడ్డి, ఓబుళరెడ్డి, రామకృష్ణ, నాగేశ్వరరావు, శ్రీనివాసులు, మురళి, హరి తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యకరమైన జీవనశైలితో క్యాన్సర్ దూరం

వైవీయూ : క్యాన్సర్ కారకాలను గుర్తించి అప్రమత్తంగా వ్యవహరిస్తూ ఆరోగ్యకరమైన జీవనశైలిని పాటిస్తే, ఆ వ్యాధి నుంచి దూరంగా ఉండవచ్చని వైవీయూ వైస్ చాన్సలర్ ఆచార్య చింతా సుధాకర్ అన్నారు. మంగళవారం వైవీయూలో ఎస్ఎస్ఎస్, కెరీర్ గైడెన్స్ సెల్, మైనార్టీ సెల్ ఆధ్వర్యంలో ×మహిళల ఆరోగ్య సమస్యల నివారణ× అన్న అంశంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన వీసీ మాట్లాడుతూ శరీరంలో ఉన్న కణాల అభివృద్ధిలో విపరీత పెరుగుదలే క్యాన్సర్‌కు కారకమన్నారు. మారుతున్న జీవనశైలి వల్ల క్యాన్సర్ బారిన పడుతున్నారన్నారు. మొదటి, రెండవ స్టేజీలలో క్యాన్సర్ నయం కావడం సులువని, తర్వాత కష్టంగా మారుతుందన్నారు. శరీరంలో మార్పులు కనిపించగానే వైద్యులను సంప్రదించాలన్నారు. ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ ఆచార్య శ్రీనివాస్ మాట్లాడుతూ నేటి విద్యార్థులు క్యాన్సర్ గురించి అవగాహన కల్పించడంలో వారధులుగా మారాలన్నారు. రీసోర్స్‌పర్సన్‌గా హాజరైన ప్రముఖ జనరల్, ల్యాపరోస్కోపిక్ సర్జన్ డా. ఎం. పావని మాట్లాడుతూ మహిళల్లో క్యాన్సర్‌కు గురయ్యే శరీరభాగాలు, వైద్యసౌకర్యాలు, ముందస్తు జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. విద్యార్థినుల సందేహాలను నివృత్తి చేశారు. ఎస్ఎస్ఎస్ పీఓ డా. సుజాత మాట్లాడుతూ సంప్రదాయ జీవన విధానం సంపూర్ణ ఆరోగ్యానికి మార్గమన్నారు. అనంతరం నోబుల్ ప్రైజ్ విజేత మేరీ క్యూరీ జయంతి సందర్భంగా నివాళులర్పించారు.